


**(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)**

# -181-

**(17 మే 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

"**ఎక్కడికండీ జయమ్మగారూ** బయలుదేరారు. ఇంట్లో పనులన్నీ అయిపోయాయా? నాలుగు కూడా కాలేదల్లే వుందే " అని జయమ్మగారిని పలకరిస్తుంది ప్రక్క యింటి పార్వతమ్మ.

"పనులకేం అవి ఎప్పుడూ వుంటాయి. ఇంకో అయిదు గంటల ప్రొద్దున్నా అవి తరగవు పార్వతమ్మగారూ. 'చేసిన కొద్దీ చాకిరీ, తిన్న కొద్దీ ఆకలి అని శాస్త్రం' వూరికే పుట్టిందా? పనుల్ని విసుగొచ్చి వెనక్కి తోస్తూ వుండాలి. కసి వచ్చి గబగబా చేస్తూ వుండాలి. ఏమంటారు? " అని జయమ్మ ప్రశ్న.

"మీరు చెప్పింది నిజమే అనుకోండి. అయినా చాకిరీలు తప్పవుగా ఏ రోజు కారోజు ఏడాది చాకిరి ఏడు ఘడియల భోగం ఇంతకీ ఎక్కడికి మీరిప్పుడు బయలుదేరారు" అని పార్వతమ్మ మళ్ళీ ప్రశ్న.

"ఆ! ఏం లేదు ఆ డాక్టరుగారి భార్య మీనాక్షి లేదూ ఆవిడకు నేనంటే ఎంతో గౌరవం. మీరు లేందే ఎక్కడికీ వెళ్ళ బుద్ధిపుట్టదు జయమ్మగారూ ఇవ్వాళ మీరు బజారు రావాలి గోళ్ళ రంగూ, తిలకం సీసా కొనాలి. కొంటే చంటిదానికి రెండు రిబ్బన్లు కూడా కొంటా. ఏం కొన్నా, ఏమీ కొనకపోయినా మీరు మాత్రం వెంట వుండాలి అని బ్రతిమాలింది అందుకని వెడుతున్నా" అంది జయమ్మ.

"గోళ్ళరంగు వాటికోసమేనా మిమ్మల్ని కూడా రమ్మంది. చీరలు వగైరాలు కొంటారేమో సెలక్షన్ కోసం మిమ్మల్ని రమ్మందేమో అనుకున్నా. ఆ వస్తువులకేం వుంది? పనిమనిషిని తెమ్మన్నా తెస్తుంది. బంట్రోతును తెమ్మన్నా తెస్తాడు" అన్నదామె కొంచెం అవహేళనగా.

"వాళ్ళకేం తెలుస్తాయండీ మీదంతా మరీ విచిత్రం గాని. ఏ వసువైనా స్వయంగా కొనుక్కుంటేనే దాని అందం. స్వంతంగా తెచ్చుకున్న వస్తువుల మీద ఎంతో ప్రేమా, గౌరవం వుంటాయి. అందుకనే ఇతర దేశాలలో మార్కెటింగ్ అంతా ఆడవాళ్ళే నిర్వహిస్తారు. మగవాళ్ళదేం వుంది 'టింగ్ రంగా' అంటూ ఆఫీసులకి తిరిగి వస్తారు" అంటూ ఆవిడ త్వరత్వరగా నడిచి వెళ్ళిపోయింది.

కొందరు సినిమాలకు బయలుదేరుతూ సాధ్యమైనంతమందిని బయలుదేరతీస్తూ వుంటారు. ఎవరైనా ఒక ఇల్లాలు "ఇవ్వాళ ఇంట్లో కొంచెం పని వుందండీ. అప్పడాల పిండి కలిపి అట్టిపెట్టాను. ఈ పూట వొత్తకపోయే పాడైపోతుంది. మరోసారి వస్తాలెండి" అంటుందనుకోండి –

"భలేవారు మీరు బాలత్రిపురసుందరిగారూ. అప్పడాల పిండి ఎక్కడికి పోతుంది ఆరు రోజులదాకా అట్లాగే ఉంటుంది. అంతగా అయితే ఏ డబ్బాలలోనన్నా వేసి మూతపెట్టండి. రేపు నేను కూడా వచ్చి కొన్ని వత్తుతాను. అప్పడాల పిండి కోసం అద్భుతమైన సినిమా పోగొట్టుకుంటామా? అందరం కలిసి వెడదామని కాదూ. ఈ సరదా మళ్ళీ ఎలా వస్తుంది. త్వరగా తయారుకండి. కేకవేస్తా" అంటూ పద్మావతి పరుగులు తీస్తూ వెళ్ళిపోతుంది.

ఇలా కొన్ని సందర్భాలలో ఇతరులొచ్చి మొహమాట పెట్టడం ద్వారా తమ పనులకు స్వస్తి చెప్పి, తగుదునమ్మా అంటూ బయలుదేరవలసి వస్తుంది. ఇలాటి స్నేహాల్నే సుడిగాలి స్నేహితాలు అంటారు. ఏ వేళప్పుడొచ్చి ఎగరగొట్టుకుపోతారో తెలుసుకోవడం కష్టంగా మరి.

మాకు తెలిసిన ఆవిడ వుంది. ఆవిడకు పొరుగింటి పనులంటే యిష్టం. వాళ్ళు వచ్చి చేసిపెట్టమనేదాకా నన్ను వూరుకోదు. తనంతట తనే వాలంటీరు చేసి వెడుతుంది. "మీరు అరిసెలు చేసుకుంటున్నారుట. నాకు కబురు పంపలేదేం ఈ చేత్తో వంద గంపలు చేశా, ఒక్కటీ చెడిపోలేదు. మీరు వస్తువులన్నీ ఇలా ఇవ్వండి" అని అడిగి తీసుకుని అర్ధరాత్రిదాకా వుండి, గంపకెత్తిగాని యింటికి రాదు.

ఇంటికి వచ్చి "అయ్యో ఒళ్ళు నొప్పులు, కాళ్ళు నొప్పులు, తలపోటు, గుండెల్లో పోటు" అంటూ వాసిన కట్టు కట్టి, విసినకర్ర కోడలి చేతికిచ్చి మూలగడం ప్రారంభిస్తుంది. ఇంట్లో అత్తెసరు పెట్టమంటే 'అమ్మో నావల్ల కాదంటుంది. పొరుగిళ్ళకు పోయి అరిసెల పాకం పట్టి వండి మరీ వస్తుంది' అని కోడళ్ళు చాటుమాటున సణుక్కుంటారు.

అత్తగారు మర్నాడు ప్రొద్దున కొంచెం లేచి కూర్చుని వచ్చిన వాళ్ళందరితో అరిసెల ప్రకరణం ప్రారంభిస్తుంది. తను ఎలా వండిందీ, ఆ యింటి వాళ్ళు ఎలా మెచ్చుకుందీ వర్ణిస్తుంది. 'ఇంకా బాగా వచ్చేవి కాని బెల్లం మంచిది కాదు. దాన్నిండా తుక్కూదుట్రా వుంది పైగా తీపి తక్కువ. తుక్కు చేసిన బెల్లం. లేకపోతే ఇంకా రుచిగా వుండేవి' అని తన పాకకళ చిటారు కొమ్మ అందుకొనపోవడానికి ఏర్పడిన అడ్డంకులను వర్ణిస్తుంది.

ఇళ్ళల్లోపనులు చేయడానికి ఎంతమాత్రం ఇష్టపడని యువకులు కొందరుంటారు. 'బంధువులొచ్చారురా! ఇంట్లో కూరలేమీ లేవు. వెళ్ళి కొంచెం ఈ పూటకు సరిపడా తెచ్చి పెట్టరా! రేపు మీ నాన్నగారు తెస్తారు' అని బ్రతిమాలితే.

"నే వెళ్ళలేనమ్మా! బోలెడు చదువుకోవాలి. చాలా అర్జంటు. అంతగా అయితే నువ్వు వెళ్ళి తెచ్చుకో ఈ పూటకి" అని అతి మోటుగా, నిర్మొహమాటంగా జవాబు చెపుతాడు.

ఒక పావుగంట తరవాత చూస్తే అతగాడు ఇంట్లో వుండడు. రాత్రి ఏ తొమ్మిదింటికో వస్తాడు తిరిగి.

"ఎక్కడికి వెళ్ళావురా?" అని ప్రశ్నిస్తే

"మా ఫ్రెండు ఫ్రెండొకడు రైలుకి వెడుతున్నాడు అందాకా వెళ్ళివద్దాం రమ్మని మా ఫ్రెండు పిలిచాడు. వాడి ఫ్రెండు కూడా 'రండి సరదాగా' అన్నాడు. అందుకని వెళ్ళాను. రైలు గంటన్నర లేటు. ఆ సమయంలో హాయిగా కాలక్షేపం చేశాం. ఒకసారి కాఫీ త్రాగం. రెండుసార్లు డ్రింకులు త్రాగాం. కాలం జలసాగా గడిచిపోయింది" అని అంటాడు ఎంతో సంబరాలు పడుతూ.

మరి కూరకు వెళ్ళమంటే "చదువు పోతుందన్నావు కదట్రా!?" అంటే "పోతే మాత్రం ఫ్రెండ్‌షిప్ పోగొట్టుకుంటామా? దాని విలువ మీకేం తెలుసు?" అంటాడు.

'అయితే బంధుత్వాలు పోగొట్టుకుంటావా' అంటాడనుకోండి. వెంటనే 'బంధుత్వాలదేం వుంది. అవన్నీ క్రీస్తుపూర్వం నాటివి. అవిపోతే క్రొత్తవి వస్తాయి.' కాలంలో మార్పులు రావటం లేదుటమ్మ. అన్నట్లు రేపు ఉదయం కొంచెం పెందరాడే లేపు. మా ఫ్రెండు ఆరింటికి రమ్మన్నాడు. వాళ్ళింకో ఇంట్లోకి వెళ్ళాలనుకుంటున్నారుట. రెండు మూడు ఇళ్ళు చూద్దాం రమ్మన్నాడు. ఎండెక్కకముందే తిరుగుదామన్నాడు' అంటాడు ఎంతో అత్యవసరమైన పనిగా భావించి.

'మరి మన యింటిగొడవలేం అక్కర లేదా?' అని తల్లి అంటే 'వాటికేమమ్మా ఎలాగో అలా నడిచిపోతాయి. మన పనులు మనం చేసుకుంటూ కూర్చుంటే సంతోషించేదెవరు?ఇతరులకు చెయ్యాలి పేరు రావాలి' అంటాడు ఎంతో ధీమాగా.

ఇలా తనకు మాలిన ధర్మాలు నిర్వహించే వారి చరిత్రలు ఎన్నో వున్నాయి. ఎక్కడపడితే అక్కడ వున్నాయి. వెతుక్కోనక్కరలేదు.

Post your comments